# పూర్ణమ్మత్త జాబు

నేను బడినుంచి ఇంటికి వచ్చేలకు పూర్ణమ్మత్త నాకోసరం కాసుకోనుంది.

"జాబు రాద్దామా" అడిగింది నన్ను చూస్తానే.

"నేను చదువుకోవాలత్తా" అన్నాను పుస్తకాలను ఇంట్లో పెడతా.

"మీ అత్త వారం దినాలనుంచీ అడగతాందాది జాబు రాయమని. ఎంచేపు పడతాది కార్డు రాసేదానికి. రాయిపో" అంది అమ్మ.

అమ్మ ముఖంలోకి చూసినా.

అమ్మ అట్ల తిరిగి అత్తతో మాట్లాడతా వుండాది. అమ్మకు అత్తకు ఇద్దరికీ చదువురాదు. జాబు రాయడమంటే ఎంత కష్టమో వాళ్ళకేం తెలుసు. అదేమన్నా బడిలో ఐవేరికిచ్చే సెలవు చీటీనా... నిజానికి అత్త రాపించేది పోస్టుకార్డే అయినా.., దాన్ని రాయాలంటే కనీసం రెండుగంటలు పడతాది... రాసేవాళ్ళకు విసుగొస్తాది. అత్త జాబు రాయాలంటే ఊర్లో పిల్లలంతా దూరంగా పరిగెత్తతారు.

పెరట్లోకి పోయి ముఖం, కాళ్ళు, చేతులు కడుక్కుని వచ్చినా. అట్ట, పేనా తీసుకుని "రాద్దామాత్తా" అన్నే.

"రా... ఇంటికి పోయి రాద్దాం" అంటా వాళ్ళింటికి పోయింది. నేనూ అత్త వెనకే పోయినా.

అత్తది మా పక్కిల్లే. ఐదడుగులా రెండంగుళాల ఎత్తుంటుంది. నలుపు రంగు. ముఖాన ఎప్పుడూ నవ్వు ఉంటుంది. నుదుటన అర్ధరూపాయంత కుంకుమ బొట్టు. ముదురు రంగు నూలు చీరలే ఎక్కువగా కడుతుంది. అత్త మానాయనకు పెద్దమ్మ కూతురు. వయసు యాభై ఏళ్ళకు పైగానే ఉంటాది. జుట్టులో సగం తెల్లవెంట్రుకలున్నాయి.

ముదురాకుపచ్చ రంగులో తెల్లటి గీతలున్న చీరలో వుంది అత్త. పెరట్లో కరివేపాకు చెట్టుకింద నులక మంచం వేసింది. నేను మంచంమీద కూర్చున్నా. అత్త పోస్టు కార్డు ఇచ్చి నా పక్కన కూర్చుంది.

రెండు మూడు నిముషాలయ్యాయి. నేను అట్ట పైన కార్డు పెట్టుకుని చేతిలో పేనా పెట్టుకునిఉన్నా. అత్త ఏమీ చెప్పలా. ఏదో ఆలోచిస్తా వుంది.

"చెప్పత్తా" అన్నే

"ఇంగా నువ్వు రాయలేదా?"

"నువ్వు చెప్తే కదా రాసేదానికి?"

"దినమ్మా చెప్పాల్నాప్పా.. క్షేమ సమాచారాలు రాస్తారు కదా.. అయ్యి రాయి.. చెప్తా" అంది అత్త.

"ఎవురికితా జాబు.."

"ఇంగెవురికి రాస్తా నాయనా జాబు .. ఎవురుండారు రాసేదానికి.. మీ మామకే" అంది. ఆ మాట్లలంటున్నప్పుడు ఆమె ముఖంలో ఏదో తెలీని నిర్వేదం... సంతోషం.

'వెంకటేశ్వర వరప్రసాదితుడైన కుమారుడు సహదేవునికి, మీ అమ్మ ఆశీర్వదించి రాయునది.. ఇక్కడ మేమంతా క్షేమం.. అక్కడ మీరందరూ క్షేమంగా వుండాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను' అని రాశాను. మళ్ళీ రెండు నిముషాలైంది. అత్త ఏమీ చెప్పలా.

"చెప్పత్తా" అన్నే.

"ఆఁ..క్షేమ సమాచారాలు రాసినావా.. ఏదీ ఇనిపించు"

రాసిన వరకూ చదివి వినిపించినా.

"నాయనా సహదేవా... ఎన్నిదినాలయిందిరా నువ్వు ఊరికి పోయి.. చెనిగ్గింజలు ఏసి పోయినావంతే... మళ్ళ ఈపక్క తిరిగి చూళ్ళా... ఇట్లయితే ఈముసిల్ది ఎట్ల చేసుకుంటాదిరా సేద్దిం.. చేన్లో గెడ్డి ఎట్ల పడిందనుకున్నేవు.. కూలోళ్ళు దొరక్క అల్లాడినా.. ఎట్లోగొట్ల చేను తొగించేసినా.. ఏళకు వానలు పన్నేయి.. కాయలు బాగూరినాయి.. ఇంగ రెండువారాల్లో చెట్లు పెరకాల.. కాయలు ముదరతాండాయి.. ఇంత వరకూ అతీగతీ లేకుంటే ఎట్ల..? ఈడ నేనాగదాన్నే ఎట్ల పనులు చేసుకునేది..? చెట్లు పెరకాలంటే వూరికే అయితాదా..? దుడ్డు కావద్దా..?" అత్త ప్రవాహంలా చెప్పుకుంటా పోతాండాది.

"అత్తా.. అత్తా..ఉండు" అని 'చెనిగ్గింజలు ఏసి పోయినాంక నువ్వు రానేలేదు. ఇంగ రెండు వారాల్లో చెట్లు పెరకాల.. కూలోల్లకు డబ్బు కావాల' అని రాసి "ఇంగ చెప్పత్తా" అన్నే.

"ఏం రాసినావో చదువు"

రాసిన వాక్యాలు చదివినా.

"ఆఁ అదే నాయనా.. ఎట్ల చెప్పాల్నో నాకు తెలీదు.. ఈమాటలు రాయి.. నువ్వు రాసిన జాబు నిన్ననే వచ్చింది. నీకు చేనుమింద ఉండే అక్కర ఈ అమ్మమింద లేదు.. చేను బాగుందా.. వానలు పన్నేయా.. కాయలు ఊరినాయా అని రాసినావే గానీ.., అమ్మా.., నీ ఆరోగ్యం బాగుందా.., ఏంచేస్తాండావు.. ఇంట్లోకి తిండి గింజలు వుండాయా? దుడ్డేమన్నా అవసరమా అని రాసినావా?..

మీ నాయన నోట్లో నాలిక లేని మనిషి. ఆయన మతం ఆయనదేగానీ చెప్తే ఏదీఇనడు. ఆ గొడ్డు మనకొద్దంటే ఇనలా.. అది దొంగ గొడ్డు.. ఏమారినామంటే పొయ్యి చేన్లో దూరేస్తాది.. మేపుకు తోలుకోని పోయినబ్బుడు ఎంచేపని దానికి కావిలుంటాము.. ఊరోల్ల చేన్లో పడి మేస్తే ఊరికే వుంటారా? చేన్లో పన్నేంక అదిలిస్తే పొడిసే దానికి వస్తాది. ఇంతకు ముందు మీరొచ్చినబ్బుడు చెప్పినా.., దాన్ని అమ్మేయుండిరా.. గొడ్డు లేకుంటే పోనీలే అని.. ముసిలాయన మాట ఇని అమ్మలా.. ఇబ్బుడేమయిందో తెలుసా.. వారం దినాలబ్బుడు మీ నాయనా పగ్గం పట్టుకోనుంటే పెరుక్కోని పోయింది. ముసిలాయన గొడ్డు ఎనకంటీ పరిగెత్తను అయితాదా.? తెలివి తక్కువ మనిసి పగ్గం వదిలేసిండగూడదా.. అట్లే పట్టుకోనున్నేదంట...

కింద పడి కాళ్ళు చేతులు దోక్కపోయినాయి. రెండు దినాలు నొప్పులు నొప్పులు అని అల్లాడినాడు. డాక్టరు దగ్గర సూదేపించుకోమంటే ఏపించుకోడు.. కాలో చెయ్యో ఇరిగింటే ఏందిగతి..? రాసినావా..?" అడిగింది అత్త.

"నువ్వు కొంచేపన్నా గమ్మునుంటే కదా రాసేదానికి"

"మళ్ళా చెప్పేదా.. యాద మరిసిపోతానో అని గబగబా చెప్పేస్తా నాయనా" అంది అత్త.

"ఉండు.. రాస్తా"

'నువ్వు రాసిన జాబు చేరింది. ఇక్కడ ఆవును మేపేదానికి పోయినప్పుడు మీ నాయన కింద పన్నేడు. కాళ్ళు చేతులు దోక్కపోయినాయి. ఇప్పుడు బాగానే వుంది' అని రాసి "ఇంగ చెప్పుత్తా" అన్నే.

"ఏదీ.. ఒగసారి తొలినుంచీ చదువూ" అంది అత్త అట్టపైనుండే జాబులోని అక్షరాలను చూస్తా.

అప్పటి వరకూ రాసింది మొత్తం చదివి వినిపించినా.

"నాకు ఆరోగ్యం బాగాలేదు.. మోకాళ్ళ నొప్పులు.. బాగా నీరసంగా వుంటాంది.. గుండెల్లో దడగా వుంటాంది.. ఈడ డాక్టరు దగ్గరికి పోయినా.. బాగ్గాలా.. ఆయప్ప దుడ్డు తీసుకుంటాడే గానీ మంచి మందులు ఈడు. రేత్రయితే చాలు.., వొళ్లు నొప్పులు.. రమణ అంగట్లో మాత్రలు తెచ్చి ఏసుకుంటాండా.. అయినా నొప్పులు తగ్గడంలేదు.. ఈడ అమ్మే మాత్రలు సొక్కమయినోటియి కాదంట గదా.. నువ్వు వచ్చేటబ్బుడు వొళ్ళు నొప్పుల మాత్రలు తే.. మీ నాయన కింద పన్నెప్పట్నించీ మణికట్టు నొప్పి అంటాండాడు. అమృతాంజనం పూసినాం.. తగ్గడంలే.. ఆట్నించీ వేరే ఏదయినా మందు తీసుకోనిరా.. హుష్.. ఈ ముండనాబొట్ట కోళ్ళు పూలచెట్లన్నీ చిదిగి పారేస్తాండాయి" అంటా అత్త కోళ్ళను తరిమేదానికి లేచింది.

'నాకు వొళ్ళునొప్పులు తగ్గేదానికి మాత్రలు తేవాలి. మీ నాన్నకు మణికట్టు నొప్పి తగ్గేదానికి కూడా ఏదన్నా మందు తీసుకురా' అని రాశాను.

పెరట్లో గోడవారంటీ కనకాంబరం చెట్లున్నాయి. వాటినిండుకు పూలు.. చివర మల్లెపందిరి, దానికి ఆనుకునే డిసెంబరాల పొద వున్నాయి. గోడమీద కుంపట్లో చేమంతులు విరగపూసిందాయి. మరో కుంపట్లో మొరం వుంది.

అత్త కోళ్ళను తరిమేసి ఇంట్లోకి పోయి జాంపండు తెచ్చి "మొన్న సంతకు పోయినబ్బుడు తెచ్చినా నీకిద్దామని. ఇచ్చేది మరిసిపోయినా.. ఏదీ.. రాసినావా?" అంటా ఇచ్చింది.

జాంపండు కొరికి నములుతా రాసినానన్నట్టు తల వూపినా.

"రాసినకాడికి చదువూ" అంది అత్త.

"ఇంగ కొంచెమేలే వుండేది.. నువుచెప్పేయ్‌తా.. ఒకేసారి చదువుతాను" అన్నే.

"ఏం చెప్పినానో నాకు గుర్తుండదు కదా. ఒగసారి చదివినావంటే .. ఇంగేమన్నా మరిసిపోయింటే చెప్తా" అంది అత్త.

జాంపండును గబగబా తినేసి, రాసిన వరకూ చదివి వినిపించినా.

"ఈ సేద్దిం గీద్దిం నువ్వు చేసుకో.. నేను చేయలేను.. మీ నాయన ఇంట్లో మనిసుండాడు

తప్పు ఎందుకూ కొరగాదు.. మొగోని మాదిరిగా అన్నిటికీ నేనే ఎగేసుకోని పోవాల. ఎంత కాలమని పోరకలాడతాం. మమ్మల్నా నీ యనకంటీ తీసకపోయి అంత ముద్దెయ్యి.. తినేసి కృష్ణా రామా అనుకుంటా మూలన పడి వుంటాం.. సేద్దిం చేసేదేల ఈ రంపూ రచ్చలేల? అబ్బుడే పద్దినాలాయ.. మన చేన్లో దిగవీదోళ్ళ సుబ్బరాయుడి గొడ్లు పన్నేయి... చెట్లన్నీ మేసేసినాయి.. ఇదేమన్నా నేయమాప్పా అని అడిగిందానికి వోడూ వోని పెండ్లాము కొట్టే దానికి వచ్చినారు. ఊర్లో వాళ్ళు సర్దిచెప్పినారనుకో. మనపైరు ఊరోళ్ళ గొడ్లు మేస్తాంటే గమ్మునుంటామా., నాలుగుమాటలనకుండా? అట్లావోడు గొడ్లను ఇంట్లో కట్టేసుకోని మేపుకోవాల.. దెగ్గిరుండి చేన్లో పడకుండా చూసుకోవాల.. పన్నేంక నాలుగు మాటలన్నే ఇనుకోవాల.. నేయానికి కాలం లేకుండా పోయిందిరా నాయనా..

చేన్లో అనపకాయలు, అలసందకాయలు ఇరగ్గాసిందాయా.. పంపిద్దామంటే మీరుండేది దెగ్గిర కాకపాయ. ఊర్లో అందరిండ్లల్లో అయ్యే కూరలు చేసి తింటాండారు. మేం ముసిలోల్లం.., మాకెన్ని కావాల.. నాలుగ్గింజలయితే చాలు. ఒగసారి వచ్చినారంటే కాయలు పెరుక్కోని పోయి కూరచేసుకోని తిందురు.. పిల్లోల్లకు అల్సందకాయలు, అనపకాయలంటే ఇష్టం కదా.. ఉడకేసుకుందురు.. రాసినావాప్పా..” అంది అత్త.

“నువ్వు కొంచేపన్నా మాటలాపితే కదా” అని ‘చేన్లో అల్సందకాయలు, అనపకాయలు చానా కాసినాయి. పిల్లోలకు ఇష్టం కదా.. మీరొకసారి వచ్చారంటే పెరుక్కోని పోవచ్చు’ అని రాసి అత్త ముఖంలోకి చూసినా.

“ఏదీ.. చదువూ” అంది అత్త.

చదివి వినిపించినా..

“చేన్లో గొడ్లు పడిందేది, సుబ్బరాముడోళ్ళు కొట్టేదానికి వచ్చిందేది రాయలేదే” అంది అత్త.

ఆరోజు గొడవ పన్నెప్పుడు నేను అక్కడే వున్నే. చేన్లో పడి నాలుగు చెనిగిచెట్లు మేస్తానే సుబ్బరాముడు వెనకే వచ్చి గొడ్లను తరిమేసినాడు. దానికే అత్త నానా రాద్దాంతం చేసేసింది. బండబూతులు మాట్లాడింది. ఊర్లోవాళ్ళు అడ్డం రాకుంటే సుబ్బరాముడు అత్తను కొట్టేవాడే.

“ఐపోయిందానికి ఎందుకులేత్తా రాసేది.. మామోళ్ళు వచ్చినాంక చెప్పుదువులే.. ఇంగేదన్నా ముఖ్యమయింది వుంటే చెప్పు” అన్నే.

“నాకొడుకు రానీ.. వోని కతుండాది.. రాయి చెప్తా.. ఇంగ రెండువారాల్లో చెట్లు పెరకాల.. నాలుగెకరాలు కదా.. మా ఇద్దర్నింటీ యాడవుతాది. చెట్లు పెరికి వామేసిచ్చేస్తే కాయలు కావాలంటే దెగ్గిరుండి ఇడిపించుకుంటా.. పెండ్లాం బిడ్డలు అందురూ రాండి.. ఈ జాబు చేరిన వెంటనే ఎలబారి వచ్చేయండి. పిల్లోల్లకు ఇద్దరికీ నాముద్దులు. పిల్లోలకు బడి వుండాదని పిల్చుకోని రాకుండా వుండేరు.. ముసిల్ది ఏందో రాసింది అని తాస్కారం వద్దు.. జాబు చేరతానే ఎలబారి రండి.. ఇట్లు మీ అమ్మ పూర్ణమ్మ” అంది అత్త.

‘చెనిగి చెట్లు పెరికేదానికి మా ఇద్దరినింటీ కాదు. ఏదో రాసినానని తాస్కారం చేయద్దు. ఈ జాబు చేరిన వెంటనే బయలుదేరి రాండి. పిల్లలకు నా ముద్దులు. వాళ్ళను కూడా తప్పక తీసుకురండి. ఇట్లు మీ అమ్మ పూర్ణమ్మ’ అని రాశాను.

నన్నే గమనిస్తున్న అత్త ఒగసారి రాసిన వరకూ చదవమంది. చదివి వినిపించినా.

"కొంచెం మిగిలిందాదా.. కింద రాయి. కోడలు శ్రీదేవికి అత్త రాయునది. ఏమమ్మా.. కోడలా.. నేనేమన్నా పరాయిదాన్నా. అవునులేమ్మా. ఎంతయినా పరాయిదాన్నే.. అదే మీ అమ్మయితే ఇట్ల చేసిందువా నువ్వు.. మీ అమ్మోళ్ళ ఇంటికి ఇన్నిదినాలు పోకుండా జాబు రాయకుండా ఉన్నిందువా.. ఎంతయినా అత్త పరాయిదేలే.. వోడంటే వుద్యోగం చేస్తాడు.. తీరికుండదు.. జాబు రాయలేదనుకో.. ఇంటికాడుండే దానివి.. నీగ్గూడా తీరిక లేదా.. కనీసం జాబయినా రాయచ్చు కదా.. ఈ ముసిలోల్లు సచ్చినారా బతికినారా అని ఏపొద్దన్నా తల్చుకున్నేవా? మమ్మల్ను తల్చుకోకుంటే పోనీలేమ్మా.. మీరంతా క్షేమంగా వుంటే అంతే చాలు..

పాపకు నామాదిరిగా ఎంటికలు బాగా పెరగతాయి.. నాగ్గూడా చిన్నబ్బుడు అట్లే వున్నేయి.. ఇంటికాడ టెంకాయలు ఆడించి పెట్టినా. సొక్కమయిన చమురు.. ఆడ ఏదంటే అది వాడతాంటారు.. ఈడికొచ్చి టెంకాయ చమురు తీసుకోనిపో.. నువ్వుగూడా ఈ చమురే పెట్చుకో.. వోడు బిన్నే ఎలబారకుంటే నువ్వయినా బిడ్డలను పిల్చుకోని వచ్చేయి.. చెనిగి చెట్లు పెరికేది అయిపోతానే ఎల్లిపోదురులే.. ఈడ మాకంటే తప్పదు.. ఈ నేలను, ఈ ఊరిని వదులుకోని రాలేము.. మీకెందుకులే ఈ తిప్పలు. మా కాలు చేయి ఆడినన్నాళ్ళు మేమే పొరకలాడతాంలే.. నా మాటలు తాస్కారం చెయ్యద్దు. సరిపోతాది కదా నాయనా" అంది అత్త.

అత్త చెప్తా వుండగానే నాలుగు వాక్యాలు రాసేసినా. కార్డు నిండిపోయింది.

"జాబు ఎప్పుడో అయిపోయిందత్తా.. ఇంగ రాయాలంటే ఇంగోటి తెచ్చుకోవాల" అన్నే నవ్వతా.

"ఏం చేసేది నాయనా. ఏడాది కొగనాడు జాబు రాస్తామా.. ఏందేందో చెప్పాలనిపిస్తాది" అంది అత్తకూడా నవ్వతా.

"ఇంగ్లాండ్ కవర్లో రాయచ్చు కదాత్తా" అన్నే.

"ఎందుకబ్బా దండగ. దుడ్డేమన్నా చెట్లకు కాస్తాండాదా.. ఇదయితే పదైదు పైసలే కదా. ఇబ్బుడు సరిపోయిందిలే.. ఏదీ ఒగసారి చదువు మొత్తం" అంది అత్త.

నేను చానా చిన్న అక్షరాలు రాస్తాను. నాది గుండ్రటి చేతిరాత. చదవడం మొదలు పెట్నాను.

"వెంకటేశ్వరుని వరప్రసాదితుడైన కుమారుడు సహదేవునికి, మీ అమ్మ ఆశీర్వదించి రాయునది.. ఇక్కడ మేమంతా క్షేమం.. అక్కడ మీరందరూ క్షేమంగా వుండాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాను. చెనిగ్గింజలు ఏసి పోయినాంక నువ్వు రానేలేదు. ఇంగ రెండు వారాల్లో చెట్లు పెరకాల.. కూలోల్లకు దబ్బు కావాల. నువ్వు రాసిన జాబు చేరింది. ఇక్కడ అవుమ మేపేదానికి పోయినప్పుడు మీ నాయన కింద వన్నేడు. కాళ్ళు చేతులు దోక్కపోయినాయి.. ఇప్పుడు బాగానే వుంది.. నాకు వొళ్ళునొప్పులు తగ్గేదానికి మాత్రలు తేవాలి. మీ నాన్నకు మణికట్టు నొప్పి తగ్గేదానికి కూడా ఏదన్నా మందు తీసుకురండి. చేన్లో అల్చందకాయలు, అనపకాయలు చానా కాశాయి. పిల్లోల్లకు ఇష్టం కదా. మీరొకసారి వచ్చినారంటే పెరుక్కోని పోవచ్చు. చెనిగిచెట్లు పెరికేదానికి మా ఇద్దరినింటీ కాదు. ఏదో రాసినానని తాస్కారం చేయద్దు. ఈజాబు చేరినవెంటనే బయలుదేరి రండి. పిల్లలకు నా ముద్దులు. వాళ్ళను కూడా తప్పకుండా తీసుకురండి. ఇట్లు మీ అమ్మ పూర్ణమ్మ.

కోడలు శ్రీదేవికి మీ అత్త రాయునది. టెంకాయలు ఆడించి పెట్టాను. స్వచ్ఛమైన కొబ్బరి నూనె వుంది. మీరు వచ్చినారంటే నూనె ఇచ్చి పంపుతాను. జాబు చేరతానే మా కొడుకు రాకపోయినా నువ్వు పిల్లలను తీసుకుని వచ్చేయాలి"

చదవడం పూర్తయింది. అత్త అంతా శ్రద్ధగా వింది. రెండు మూడుచోట్ల మళ్ళీ చదవమని చెప్పి వింది.

"నేను చెప్పినంత కోపంగా నువ్వు రాయవు కదబ్బోడా" అంది అత్త.

"అట్ల రాస్తే ఎట్లత్తా.. ఎదురుంగా మనిసుంటే నాలుగు మాటలను.. మనం కార్డులో రాస్తాండాం కదా. అడికి పోయాలకు ఎంతమంది చదవతారో.. మామను ఎవురన్నా ఏమన్నా అనుకోరా?" అన్నాను.

"అవున్లే అబ్బోడా.. వోళ్ళమింద నాకేమన్నా కోపమా.. ఏందో ఈడ పనులతో యాష్టయ్యి అట్లంటా.. అంతేలే.. ఈడ మాకేం తక్కువుండాదని.. బిడ్డలు లేరే అనే దిగులంతే.. సరేలే.. రేపు బడికి పోయినప్పుడు జాబును మరిచిపోకుండా డబ్బాలో ఏసేయి" అంది అత్త.

"సరేత్తా" అని లేచాను.

అప్పటికి మసక చీకట్లు కమ్ముకుంటున్నాయి. మామ ఆవులను తోలుకోని వచ్చాడు. అవి కుడితి నీళ్ళు తాగుతున్నాయి. అత్త ఇంట్లో దీపం వెలిగించేదానికి పోయింది.

చచచచ

"ఏం మెయిల్ పంపించాడు కొడుకు.. గంటనుంచీ అక్కడే కూర్చుని చూస్తున్నావే" అంది పల్లవి.

అప్పటి వరకూ నా బాల్య జ్ఞాపకాల్లో ఉన్న నేను ఉలిక్కి పడ్డాను. పక్కకు జరిగి "చూడు.." అన్నాను.

ఎకబిరి ఈబిఖి. ఒళిగీ ఫ్రపి. । బిళీ ఓరిదీలి. ం౦. ఫ్రళిళిఖి శ్రీ౨ఎ కంప్యూటర్ స్క్రీన్ పై ఉన్న మెయిల్‌ను గట్టిగా చదివింది పల్లవి.

"అదీ మెయిల్" అన్నాను. "అక్షరాల్లో బాగా పొదుపు పాటించాడండి.. ఈ నాలుగక్షరాలను ఇంతసేపు చదివారా?" అంది నవ్వుతూ పల్లవి.

"నాలుగక్షరాలను చూడగానే నా బాల్యం గుర్తొచ్చింది. నాచిన్నప్పుడు మా అత్తకు రాసి పెట్టిన ఉత్తరం గుర్తొచ్చింది.. ఔనూ నీ మెయిల్ చూసుకున్నావా.."

"ఆఁ చూశాను.. ఏమిస్తాడు.. హాయ్.. మామ్.. హౌఆర్ యూ.. ఐ యామ్ ఫైన్. నౌ బిజీ.. ఓ.కే. గుడ్ నైట్.. అని ఇచ్చాడు"

"సెల్ ఫోన్లు, ఇంటర్నెట్‌లు వచ్చాక కమ్యూనికేషన్ పెరిగింది. కానీ మనుషుల మధ్య కమ్యూనికేషన్ తగ్గడం లేదా?" అన్నాను.

"ముందు స్నానం చేద్దురు రండి.. నీళ్ళు చల్లారి పోతాయి.. తర్వాత తీరిగ్గా ఆలోచిద్దురు" అంది పల్లవి నవ్వుతూ. •

*జనవరి 2009, ప్రాణహిత వెబ్ మ్యాగజైన్*